• 'డబుల్ ఇండ్ల'కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

• పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతోపాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ–1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటిపెల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

వీర్ల నర్సవ్వ

ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలు దేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

కుంభమేళాలో మహిళలు అదృశ్యం

బెల్లపు సత్తవ్వ

ఎనుగుల బుచ్చవ్వ

కడెం, జనవరి 31: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో కడెం మండలంలోని బెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన బెల్లపు సత్తవ్వ, కల్లెడ గ్రామానికి చెందిన ఎనుగుల బుచ్చవ్వ తప్పిపోయారు. ఈ ఇద్దరు జగిత్యాల జిల్లాకు చెందిన మరో ఏడుగురితో కలిసి ట్రావెల్ వాహనంలో ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఇంటి నుంచి బయలుదేరిన మహిళలు జగిత్యాలకు చెందిన కొందరు మహిళలతో కలిసి బుధవారం సాయంత్రం ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. దాదాపు 50 ఏళ్ల పైబడి వారే అంతా 29వ తేదీన అక్కడికి చేరుకున్నారు. వీరంత స్నానాలు చేసేందుకు రెండు ఆటోల ద్వారా వెళ్తున్న క్రమంలో ఒక ఆటోలో ఆరుగురు, మరో నలుగురు ఇంకో ఆటోలో వెళ్లగా ట్రాఫిక్ జామ్ అయి అక్కడే తప్పిపోయినట్లు తెలిపారు. ఈ విషయమై ట్రావెలర్ డ్రైవర్ వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. . ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వారి ఆచూకీ కోసం అక్కడికి వెళ్లారు. అయితే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వారి ఆచూకీని తెలుసుకుంటున్నట్లు తెలిపారు. తప్పిపోయిన తమ కుటుంబ సభ్యులను తిరిగి రప్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మా భూములు కావాలనడం సరికాదు

నిర్మల్ అర్బన్, జనవరి 31 : 30 సంవత్సరాల క్రితం అమ్ముకున్న భూములు మళ్లీ మాకే కావాలనడం సమంజసం కాదని పీఏసీఎస్ ఇన్వెస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ పీసీఎస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ రెడ్డి మాట్లాడారు. సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో 500 ఎకరాలకు పైబడి వ్యవసాయ భూములను కంపెనీ కొనుగోలు చేసిందని, అమ్ముకున్న భూములను మళ్లీ మాకే కావాలనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఒకసారి అమ్మిన భూములను మాకే కావాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం సరికాదని రైతులు ఒక్కసారి ఆలోచించాలన్నారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖానాపూర్ టౌన్, జనవరి 31: నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఖానాపూర్ సీఐ సైదరావు అన్నారు. ఖానాపూర్‌లోని గాంధీ నగర్ కాలనీలో శుక్రవారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో నంబర్ ప్లేట్, సరైన ధృవపత్రాలు లేని పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అనంతరం సీఐ సైదరావు మాట్లాడుతూ.. కార్డన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలను అప్రమత్తం చేయడమే అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణించే సమయంలో వాహనాల అన్ని ధృవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాహుల్, కృష్ణసాగర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదకరంగా ఫూట్ బోర్డుపై ప్రయాణం

ద్విచక్ర వాహనంపై నలుగురు వ్యక్తులు వెళ్తూ..

సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వాహనదారుడు

ప్రమాదకరంగా ప్రయాణం

నిర్మల్‌లో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనదారులు రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రోడ్లపైకి దూసుకొస్తున్నారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే శివాజీచౌక్, బస్టాండ్ ఏరియా, ఈద్గా చౌరస్తాలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒక పక్క రోడ్డు రవాణా శాఖ, పోలీసులు జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు జరుపుకుంటే వాహనదారులు మాత్రం అవేమి పట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. - నిర్మల్ ఫొటోగ్రాఫర్

ప్రతిభ కనబర్చిన జిల్లా క్రీడాకారులు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా వాసుల ప్రతిభ

ఎదులాపురం, జనవరి 31: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి యూసఫ్ గూడ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. క్యాడెట్, సీనియర్ కేటగిరి పూమ్సే విభాగంలో జిల్లాకు చెందిన వడ్నాలశ్రీ, జటంగుల విద్మహే, స్వర్ణ పతకం, గుంజి ఏంజెల్, జాతంగుల విద్మహి, వదనల కీర్తన వెండి పతకం, ఆకోజివార్ శృతి, రాథోడ్ వనిత, రేణుక దివ్య, బొంపల్లి ప్రణయ్ కుమార్, షిండే అభి, గుంజి ఏంజెల్, మాస్టర్ వీరేశ్, గొంగళి శివకుమార్ రజత పతకాలు సాధించారు. జిల్లా నుండి రెండు స్వర్ణ, 3 వెండి, 5 రజత పతకాలు సాధించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జిల్లా వాసులను తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, కార్యదర్శులు వీరేశ్, డైరెక్టర్ శృతి, కోచ్ జాతీయ నిర్ణేతలు అన్నారపు వీరేశ్, శృతి, కన్య మాధవి, రాథోడ్ వనిత అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఇంద్రవెల్లి, జనవరి 31: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెలిల మండలం ముత్నూర్ గ్రామంలోని పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది దత్తాత్రియ, బాపురావ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...బేల మండలం బోరిగాం గ్రామానికి చెందిన దాదారావ్, ఉట్నూర్ మండలంలోని రాజన్నగూడ గ్రామానికి చెందిన రాకేశ్ వేర్వేరు ద్విచక్రవాహనాలపై ఇంద్రవెల్లి వైపు వెళ్తుండగా ఒకరిని ఒకరు ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

కెమెరాకు చిక్కిన అరుదైన హైనా



మావల అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కిన హైనా

ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలంలోని అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. చారలు కలిగి, కళ్లు నల్లగా, కండలు కలిగి, చెవులు పెద్దవిగా, మెడ పెద్దగా నలుపు రంగులో ఉంటుందని నిపుణులు తెలిపారు. దేశంలో చాలా తక్కువ సంఖ్యలో కనిపించే చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ టీవీ కెమెరాకు చిక్కడం, అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అధికారులు తెలిపారు.

ఎన్నికల కోడ్‌తో అధికారులకు ఇబ్బందులు

ఉట్నూర్, జనవరి 31:ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు కావడంతో గిరిజన దర్బార్‌లో అధికారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దర్బార్ నిర్వహిస్తున్న సమయంలో ఒకసారిగా ఎంపీ నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దర్బార్‌లోకి వస్తుండగా అధికారులు సమాచారం అందుకోగానే పక్కనున్న గదులోకి వెళ్లారు. నాయకులు వెళ్లిపోగానే దర్బార్‌ను కొనసాగించారు. మళ్లీ కొంత సమయానికి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, మాజీ ఎమ్మెల్సీ దండే విఠల్, పలువురు నాయకులు దర్బార్ సమీపంలోకి రావడంతో మరోసారి అధికారులు వెళ్లాల్సి వచ్చింది. ఇలా రెండు సార్లు అధికారులు ప్రజాప్రతినిధులను తప్పించుకొని వెళ్లారు. దీంతో దర్బార్‌లో పాల్గొన్న గిరిజనులు ఏమి జరుగుతుందో తెలియక ఆశ్చర్యానికి గురయ్యారు.

ఎస్టీ హోదా సాధించే వరకు మాలీలు విశ్రమించరు

ఎదులాపురం, జనవరి 31 : 24 సంవత్సరాలుగా ఆంధ్రలో ఎస్టీలుగా ఉండి తెలంగాణలో బీసీలుగా ఉన్న మాలీ కులస్తులకు సామాజిక న్యాయం లభించాలని, ఎస్టీ హోదా సాధించే వరకు మాలీలు విశ్రమించరని మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కూలే అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని పూలే గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్టీ హోదాకై ఫిబ్రవరి 10వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 9న ఆదిలాబాద్‌లోని గోకుల్ బెన్ క్విట్‌హాల్ యాదవ సంఘ భవనంలో మాలీ సంఘం రాష్ట్ర, జిల్లా, యువజన, మహిళా కమిటీల ఎన్నికలు జరగనున్నాయని ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘ క్రియాశీల కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంబన్న షిండే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ గుర్నులే, కోశాధికారి సతీశ్ గుర్నులే, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ ఉత్తమ్ వాడగురే, కార్యవర్గ సభ్యులు దీపక్ మొహుర్లే, శ్రీను ఆచారి, నందకిశోర్ నాగోషే, మురళీధర్, నాగోషే, గజానన్ మొహుర్లే, సంతోష్ దరి, రాంకిషన్ షిండే, శంకర్ పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

ఉట్నూర్/ఇంద్రవెల్లి, జనవరి31: ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు చాలా గొప్పవని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతరలో నిర్వహించిన దర్బార్‌లో పాల్గొన్నారు. గిరిజనుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్, పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, తొమ్మిది తెగల నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఉట్నూర్ రూరల్, జనవరి 31: బుడుందేవ్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం శాంపూర్‌లోని బుడుందేవ్ ఆలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నాగోబాకు పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

ఆఫీసర్స్ క్లబ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

ఎదులాపురం, జనవరి 31 : ఆదిలాబాద్‌లోని ఆఫీసర్స్ క్లబ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. 2018లో క్లబ్ కార్యవర్గ కాల పరిమితి ముగిసింది. అప్పటి నుంచి త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో ఆఫీసర్స్ క్లబ్ కొనసాగుతోంది. అయితే ఇటీవల కొందరు ఇదే విషయమై కలెక్టర్‌ను కలిసి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. దీంతో ఎన్నికల అధికారిగా జిల్లా సహకార అధికారి మోహన్‌తో పాటు సహాయ ఎన్నికల అధికారిగా డీసీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఆత్మారాంను నియమించారు. శుక్రవారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఎనిమిది మంది డైరెక్టర్ల కోసం నామినేషన్ల ప్రక్రియను చేపట్టారు. 18 మంది నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా డీసీఓ మోహన్ మాట్లాడుతూ ఆఫీసర్స్ క్లబ్ ఎన్నికలు నిర్వహించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు నామినేషన్లను స్వీకరించడం జరిగిందన్నారు. 320 మంది క్లబ్‌లో సభ్యులుగా ఉన్నారన్నారు. 8 మంది డైరెక్టర్ల కోసం ఒక్కొక్క అభ్యర్థి నుంచి రూ. వెయ్యితో నామినేషన్ తీసుకున్నామన్నారు. ఫిబ్రవరి 1న స్క్రూటి, 4న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికైన డైరెక్టర్లు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కల్చరల్ కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకుంటారని తెలిపారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ఉట్నూర్ రూరల్, జనవరి 31: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని లక్కారంలో సీతా గోంది ఆత్రం రాజా దేవుషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతాగోంది ఆత్రం సుధాకర్ రావు దొర స్మారకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 100 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, వైద్యుడు మహేందర్, కుమ్మరి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా కన్వీనర్ రఘు, విశ్రాంత ఉద్యోగి భీంరావ్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, మాజీ సర్పంచ్ కోల సత్తన్న, డాక్టర్ రాజ్‌గోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.